# సింగిల్ పేజీ కథలు

## రాయి

సుధాకర్ ఒక పెద్ద కంపెనీలో ఎగ్జిక్యూటివ్. ఆమధ్యనే కంపెనీ లోను తీసుకొని మంచి కారు కొనుక్కున్నాడు. లోపల దుమ్ము ధూళి పడకుండా ఉండాలని కొంత, బయట ఎండగా ఉందని కొంత విండోస్ వేసుకుని డ్రయివ్ చేస్తుంటాడు.

ఓ రోజున గురుగాం శివార్లలో ఏదో పని వుండి కార్లో వెడుతున్నాడు తను. రోడ్డుకి అటూ యిటూ చాలా షాపింగ్ మాల్స్ ఉన్నాయి. అక్కడ రోడ్డు మీద మనుషులకన్నా బార్లు తీరిన కార్లు, పరుగులెత్తే కార్లు ఎక్కువగా ఉన్నాయి. హఠాత్తుగా ఎవరైనా రోడ్డు మీదకి వచ్చినా తెలియనంతగా పార్కింగ్ ప్లేస్‌లో కార్లు రద్దీగా ఉన్నాయి.

సుధాకర్ కారు కొంచెం వేగంగానే వెడుతోంది. ఏదో రాయి తన కారు వైపు విసురుగా రావటం అతను క్రీగంట చూసాడు. అప్పటికే అది మూసి వున్న అద్దానికి కొట్టుకుని పగులు తీసింది. అతను సడన్ బ్రేక్ వేసి కిటికీ తలుపు తెరిచి వెనక్కి చూసాడు. ఎవరో ఐదారేళ్ళ కుర్రాడు. అపరాధిలా నిలబడివున్నాడు!



తన కారుని బేక్ చేసిన ఆ కుర్రాడికి దగ్గరగా పోనిచ్చి క్రిందకి దిగాడు సుధాకర్.

"నువ్వేనా రాయి విసిరింది?" అని హుంకరించాడు.

బిక్కుబిక్కుమంటూ తల వూపాడు కుర్రాడు.

కోపంగా వాడి దగ్గరకి వెళ్ళి చొక్కా పట్టుకుని పక్కనున్న కారుకి నొక్కి పెట్టి "రాయి నెందుకు విసిరావ్? చూడు అద్దం ఎంతగా బ్రద్దలయిందో! దీనికెంతవుతుందో తెలుసా? నువ్విస్తావా డబ్బు?" అంటూ గర్జించాడు.

ఆ కుర్రాడు కళ్ళల్లో నీళ్ళు "చెయ్యి వూపితే ఎవ్వరూ ఆపటం లేదు..ఇంకేం చేయాలో తెలియక"

"ఎందుకు ఆపాలనుకుంటున్నావ్?" అన్నాడు సుధాకర్ నొసలు చిట్లించి.

"వీల్ చెయిర్ క్రిందపడిపోయింది. తమ్ముడు పడిపోయాడు. వాడ్ని ఎత్తలేక..." అన్నాడా కుర్రాడు ఏడుపు ముఖంతో.

అప్పుడు పక్కకి తిరిగి చూసాడు సుధాకర్. నిజమే! బీటలు తీసిన పేవ్‌మెంట్ మీద గొయ్యిలా వుంది. దాని పక్కనే ఒరిగిపడిపోయింది వీల్ చెయిర్. దానిపక్కనే క్రిందపడిపోయిన పిల్లాడు. ఏడాది వయస్సుంటుందేమో! బొద్దుగా ఉన్నాడు.

గబగబ అక్కడికి వెళ్ళి వీల్ చెయిర్‌ని నిలబెట్టి ఆ పిల్లాడిని అందులో కూర్చోబెట్టాడు. ఆ కుర్రాడు చొక్కా చేతులకి కళ్ళొత్తుకుని కృతజ్ఞతగా చూసాడు.

"ఇంత చిన్న పిల్లాడ్ని పెట్టుకుని వీల్ చెయిర్‌తో ఒక్కడివీ ఇక్కడెందుకు తిరుగుతున్నావ్?" అని మందలింపుగా అడిగాడు సుధాకర్.

వాళ్ళ తల్లి షాపింగ్ మాల్‌లో పనిచేస్తోంది. తమ్ముడు ఏడుస్తున్నాడని బయట వీల్ చెయిర్‌లో తిప్పమని వాడికి చెప్పింది. పేవ్‌మెంటు పక్కన చల్లని నీడలో తిప్పవచ్చని వాడటు తీసుకువచ్చాడు. అక్కడో గొయ్యి వుందని వాడు చూసుకోలేదు. వీల్ చెయిర్ పడిపోయింది. తల్లిని పిల్చుకు వద్దామంటే ఏడుస్తూ పడివున్న తమ్ముడ్ని ఒక్కడ్నీ వదలి వెళ్ళలేడు. పక్కనుంచి విసురుగా పోతున్న కార్ల వాళ్ళు తప్ప మరో మనిషి అటుగా రావటం లేదు. చెయ్యెత్తి ఆపితే ఎవరూ ఆగటం లేదు. తమ్ముడ్నెలాగయినా కాపాడాలన్న కోరికే వాడిచేత అంతపని చేయించింది. వాడు హావభావాలతో చెప్పిన మాటల్ని బట్టి సుధాకర్ అర్థం చేసుకున్నదది!

తన జేబురుమాలు తీసి క్రింద పడిపోయి దెబ్బలు తగుల్చుకున్న పిల్లాడి ఒంటి మీద రక్తం మరకలు, దుమ్ము చారికలు తుడిచాడు సుధాకర్.

ఎవరో అపరిచిత వ్యక్తి తన పిల్లల్ని వీల్ చెయిర్‌తో సహా తీసుకురావటం మాల్‌లోని కౌంటర్ అద్దం వెనుకనుంచి చూసి పరుగు పరుగున వచ్చింది వాళ్ళని కన్నతల్లి. "ఏం జరిగిందండీ!" అని ఒక్క గుక్కలో అడిగింది.

ఏం జరిగిందో చెప్పటమే కాదు. అలా జరక్కుండా చూడాల్సిన బాధ్యత ఆ తల్లిదని గుర్తు కూడా చేసాడతను.

"వాడలా ఎన్నోసార్లు బయటికి తీసుకువెళ్ళాడండీ! ఎప్పుడూ ఇలా కాలేదు" అంది ఆమె అపరాధభావంతో.

"పిల్లలు ఎప్పుడు ఏం చేస్తారో ఎవర్కీ తెలియదు. వాడి తమ్ముడ్ని కాపాడుకోవాలని వాడు రాయి మాత్రమే విసిరాడీవేళ. రేపు కారుకు అడ్డంగా వచ్చి ఆపబోతే? ఎంత ప్రమాదం జరుగుతుందో ఆలోచించండి?"

ఆమె గుండె చేత బట్టుకుని "అమ్మో" అంది.

"ఇకనుంచయినా మీ జాగ్రత్తలో మీరుండండి."

అతనికి థేంక్స్ చెపుతూ అతని కారు దాకా ఆమె నడిచి వచ్చింది. "మా వాడి మూలంగా.." అంది పగిలిన అద్దాన్ని తడుముతూ.

జరిగిన దానికిప్పుడు సుధాకర్ బాధపడటం లేదు. చిన్నవాడైన తమ్ముడిమీద ఎదుగుతున్న అన్న చూపించిన ప్రేమ ఎంత గొప్పదో తెలిసాక అతనికెంతో ఆనందంగా ఉంది.

"ఫర్వాలేదు" అని మందహాసం చేసి ఆ పిల్లాడి భుజం మీద వాత్సల్యంగా తట్టి తన కారెక్కాడు.

**-తటవర్తి రామచంద్రరావు**
**(న్యూఢిల్లీ)**